ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
శనివారం 25 జనవరి 2025



ఓటరుగా గర్విద్దాం..

4,76,435.. ఇదీ జిల్లా ఓటర్ల లెక్క..

- పురుషులు 2,29,852 మంది, మహిళలు 2,47,046 మంది
- జిల్లాలో మహిళా ఓటర్లే అధికం
- ఓటరు కార్డుతో ఎన్నో ఉపయోగాలు
- ఓటు హక్కు నమోదుకు విస్తృత ప్రచారం
- నేడు జాతీయ ఓటరు దినోత్సవం





(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

సామాన్యుడి చేతిలోని వజ్రాయుధం ఓటు హక్కు.. తమకు నచ్చిన వారిని పాలకులుగా ఎన్నుకునే అవకాశం ఓటు హక్కు ద్వారానే లభించింది. ఓటరుగా దేశ రాజకీయ వ్యవస్థనే మార్చే అవకాశం ఉన్నందుకు గర్వించాలి. ఓటుహక్కు నమోదు వినియోగంపై అవగాహన కల్పించే దిశగా ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 2001 నుంచి ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న ఓటరు దినోత్సవాన్ని శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎంతో ఉత్సాహంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

● జాతీయ ఓటరు దినోత్సవం నేపథ్యం ఇదీ..

భారత రాజ్యాంగం 15వ భాగంలో 324వ అధికరణం ఎన్నికల సంఘం నిర్మాణం, అధికారాలు, విధులను ప్రస్తావించింది. భారత ఎన్నికల సంఘం జనవరి 25, 1950లో ఏర్పడింది. అందుకే 2011 నుంచి జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఎన్నికల సంఘం స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పదవులకు పార్లమెంట్ ఉభయ సభలకు రాష్ట్ర శాసనసభలకు, విధాన పరిషత్‌లకు ఎన్నికలు నిర్వహించడం ప్రధాన విధులు. ఈ సంఘం ఉప ఎన్నికలు, మధ్యంతర ఎన్నికులు కూడా నిర్వహిస్తుంది. సంఘానికి ప్రస్తుతం ఒక ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు ఎలక్షన్ కమిషనర్లు ఉన్నారు. ఈ కమిషనర్లను కేంద్ర మంత్రి మండలి సూచనలు అనుసరించి రాష్ట్రపతి నియమిస్తారు.

● ఎన్నికలు వస్తే రాజకీయ నేతల పరుగులు..

ఎన్నికలు వచ్చాయంటే ఓటరు దేవోభవ అంటూ రాజకీయ నేతలు పరుగులు తీస్తారు. సామాన్యుడి నిర్ణయాలతో రాజకీయాలు, దేశ భవిష్యత్‌లోనూ మార్పులు వస్తాయి. ఓటుకు రాజకీయ నేతల భవిష్యత్ చూపుడు వేలుకు పెట్టే సిరా చుక్కతో తారుమారవుతుంది. ఓటర్లే నిర్ణేతలుగా ఉంటారు. మనిషికి ఒక వజ్రాయుధంగా రాజ్యాంగం ప్రతి ఒక్కరికి కల్పించిన హక్కు ఓటుహక్కు. ఓటుహక్కు పొందడానికి ఎన్నికల కమిషన్ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తోంది. దేశంలో 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరు అర్హులుగా కమిషన్ ఆధునిక సాంకేతిక మార్గాల ద్వారా కూడా ఇందుకోసం ప్రత్యేక శిబిరాల ద్వారా ప్రచారం నిర్వహిస్తోంది. ఆధార్ లింకేజీని కూడా ఓటరు గుర్తింపునకు చేశారు. కలర్ గుర్తింపు కార్డులు కూడా కమిషన్ అందిస్తోంది.

● జిల్లాలో 4,76,435 మంది ఓటర్లు

జిల్లాలో ప్రధానంగా ఉన్న సిరిసిల్ల, వేములవాడ రెండు సెగ్మెంట్లలో 4,76,435 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 2,29,352 మంది, మహిళలు 2,47,046 మంది ఉన్నారు. 37 మంది ట్రాన్స్‌జెండర్లు, 169మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. రెండు నియోజకవర్గాల్లో 17694 మంది మహిళ ఓటర్లే అధికంగా ఉన్నారు. సిరిసిల్ల సెగ్మెంట్‌లో 2,48,334మంది ఓటర్లు ఉండగా, పురుషులు 1,20,498 మంది, మహిళలు 1,27,829 మంది ఉన్నారు. 7 మంది ట్రాన్స్‌జెండర్లు, 106 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళలు 7331 మంది అధికంగా ఉన్నారు. వేములవాడ సెగ్మెంట్‌లో 2,28,101మంది ఓటర్లు ఉండగా, పురుషులు 1,08,854 మంది, మహిళలు 1,19,217 మంది ఉన్నారు. 30 మంది ట్రాన్స్‌జెండర్లు, 63మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. మహిళలు 10,363మంది అధికంగా ఉన్నారు.

● రాష్ట్రపతి నుంచి సామాన్యుడి వరకు ఒక్కటే గుర్తింపుకార్డు..

దేశంలో రాష్ట్రపతి నుంచి గ్రామపంచాయతీ వార్డు సభ్యుడి వరకు, అత్యున్నత..

మిగతా 8లో

న్యూస్ బాక్స్

పేద కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందజేత

సిరిసిల్ల టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో ఇంటిని కోల్పోయిన బాధిత పేద కుటుంబానికి శుక్రవారం సిరిసిల్లలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆర్థిక సహాయాన్ని అందించారు. సిరిసిల్ల పట్టణ 25వ వార్డు పద్మనగర్‌కు చెందిన ఎక్కలదేవి కనకవ్వ ఇటీవల ఇల్లు అగ్నిప్రమాదానికి గురై దగ్ధమైంది. కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి చొరవతో బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, స్థానిక కౌన్సిలర్ కుడికాల రవికుమార్ రూ.25వేల చెక్‌ను అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ నాయకులు పాల్గొన్నారు.

జాతర పోస్టర్ ఆవిష్కరణ

వేములవాడ రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : నాగాయపల్లిలో ఈనెల 28వ తేదీన జరిగే శ్రీ దుబ్బరాజేశ్వర స్వామి జాతర పోస్టర్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎస్పీ అఖిల్ మహాజన్‌ను రాజన్న కండువా కప్పి సన్మానించి జాతరకు రావాలని ఆహ్వానించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బండ కొమురయ్య, రొండి శంకర్, బండి రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తంగళ్లపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తంగళ్ళపల్లి మండలం ఇందిరమ్మ కాలనీ గ్రామానికి చెందిన జక్కని మహేష్ కుటుంబాన్ని సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కేకే మహేందర్‌రెడ్డి పరామర్శించారు. గురువారం ప్రజాపాలన గ్రామసభలో పాల్గొని ఇంటికి తిరిగి వెళుతున్న క్రమంలో జక్కని మహేష్ గుండెపోటుతో మృతిచెందాడు. కుటుంబాన్ని తహసీల్దార్ జయంత్ కుమార్‌తో పాటు కేకే మహేందర్‌రెడ్డిలు పరామర్శించి ప్రభుత్వపరంగా మంజూరైన రూ.50వేల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జలగం ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు ఇట్టి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, భైరినేని రాము, భైరి శ్రీవాణి రమేష్, మునిగేల రాజు, గుగ్గిళ్ల భరత్ గౌడ్, గడ్డం మధుకర్, భాగ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

సిరిసిల్ల టౌన్ జనవరి 24(ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని 25వ వార్డు పద్మనగర్ లో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ లావణ్య వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ లావణ్య మాట్లాడుతూ వార్డులో మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ4 లక్షల 35 వేల నిధులతో పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. అధ్యక్షుడు సత్యనారాయణ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ వెలుముల స్వరూప తిరుపతిరెడ్డి మున్సిపల్ డీఈ వాణి, వార్డు కౌన్సిలర్ కుడికాల రవి కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వధిక, పార్టీ నాయకులు దేవదాస్, తాటికొండ శ్రీనివాస్, వంగరి దత్తు, మిట్టపల్లి రవి, మెరుగు లక్ష్మణ్, సిరిమల్లె నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తంగళ్లపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ తెలంగాణ క్యాలెండర్, డైరీలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీకాంత్, వాసుదేవరావు, మల్లికార్జున్, రామచంద్రరావు, విమల, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పని చేసిన వారికే గుర్తింపు..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజల కోసం పనిచేసిన నాయకులకే తగిన గుర్తింపు లభిస్తుందని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పురపాలక సంఘం పాలకవర్గం సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజకీయ నాయకులు ప్రజల కోసం పనిచేయడమే తొలి ప్రాధాన్యంగా పెట్టుకోవాలన్నారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు చేయాలని, మిగతా సమయంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై దృష్టి సారించి పనిచేయాలన్నారు. కేవలం అధికారమే పరమావధిగా పనిచేయడం వల్ల ఫలితం ఉండదని, న్నారు. గత ఐదేళ్ల కాలంలో వేములవాడ పట్టణాన్ని రూ.110కోట్లతో అభివృద్ధి చేయడం శుభ పరిణామమని, రాబోయే రోజుల్లోనూ వేములవాడ పట్టణాన్ని, నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. పదవీకాలం పూర్తి చేసుకున్న మున్సిపల్ పాలకవర్గం సభ్యులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సన్మానించగా, మున్సిపల్ పాలకవర్గం తరఫున ఆది శ్రీనివాస్‌ను సన్మానించారు. మున్సిపల్ ఛైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, కమిషనర్ అన్వేష్, వైస్ ఛైర్మన్ మహేష్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఉపాధి అవకాశాలు మెరుగు..

- మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ



బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ, పక్కన కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

ఇల్లంతకుంట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు ఉపాధి అవకాశాలు మెరుగు అయ్యాయని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి సీఎం కప్ విజేతలకు బహుమతులు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ క్రీడాకారులను వెలుగులోకి తేవాలని సీఎం కప్ పోటీలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆటలు నేడు ఉపాధికి బాటలుగా మారాయని, పాఠశాలలో చదువుతోపాటు ఆటలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఆటల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, ఎంపీవో సంధ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

కక్షతోనే సిరిసిల్లకు నిధులు రానివ్వడం లేదు..

- ప్రణాళికా బద్ధంగా పనిచేయడం దేశానికి చూపించాం - వచ్చిన అవార్డులే నిదర్శనం - బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు కే తారకరామారావు



సిరిసిల్ల మున్సిపల్ ఛైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, వేములవాడ మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామతీర్థపు మాధవిరాజును సన్మానిస్తున్న కేటీఆర్

సిరిసిల్ల, జనవరి 24 ((ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పదేండ్లలో చేసిన పనులు ప్రజలు యాది చేసుకుంటారని సిరిసిల్లలో రూ.వంద కోట్ల పనులు జరిగాయని, అరు నెలల్లో ఎన్నికలు వస్తాయనే సమయంలో సిరిసిల్ల మున్సిపాలిటీకి రూ.40 కోట్లు వివిధ పనులు మంజూరు చేస్తే కక్ష పూరితంగా కాంగ్రెస్ ప్రభుత్వం పగబట్టినట్లు రూ.40కోట్లు నిధులను పక్కన పెట్టిందని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు కే తారకరామారావు అన్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ తెలంగాణ భవన్‌లో పదవీకాలం ముగిసిపోనున్న సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పాలకవర్గాల్లో ఛైర్‌పర్సన్లు జిందం కళచక్రపాణి, రామతీర్థపు మాధవిరాజులతో పాటు కౌన్సిలర్‌లకు బీఆర్ఎస్ పార్టీ తరఫున ఆత్మీయ సత్కారం చేశారు. అంతకుముందు సిరిసిల్లపట్టణంలో వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. సన్మాన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ గతంలో బల్దియా అంటే తిన్నామా, ఛాయ్ తాగామా పోయామా అన్నట్లుగా ఉండేదన్నారు. తెలంగాణ వచ్చిన తరువాత కేసీఆర్ ముఖ్యమంత్రిగా పట్టణం, పల్లెల్లో వసతులు కల్పించాలని విధులు గుర్తు చేయడంతోపాటు నిధులను కూడా సమకూర్చారని అన్నారు. పార్కులు, వైకుంఠధామాలు, రోడ్లు, ఇతర ప్రగతి పనులతో దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అవార్డులే నిదర్శనమని అన్నారు. దేశంలో మూడు శాతం కంటే తక్కువ జనాభా ఉన్నా తెలంగాణకు గ్రామీణాభివృద్ధిలో 30 శాతం అవార్డులు వచ్చాయన్నారు. పట్టణ అభివృద్ధిలో అతిపెద్ద రాష్ట్రం మహారాష్ట్రకు 29అవార్డులు వస్తే తెలంగాణకు 26 అవార్డులు వచ్చాయన్నారు. ఊకదంపుడు మాటలు, బడాయి మాటలకు రాలేదని ప్రణాళికాబద్ధంగా కలిసికట్టుగా పనిచేస్తేనే సాధ్యమైందన్నారు. 2014కు ముందు సిరిసిల్ల, వేములువాడ పరిస్థితి ఎలా ఉండేదో గమనించాలని అన్నారు. 2009లో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎండాకాలంలో పట్టణాలకు గ్రామాలకు వెళితే బిందెలు అడ్డం పెట్టేవారని అన్నారు. సొంత ఖర్చులతో ఎమ్మెల్యేలు గల్లీ గల్లీకి నీటి ట్యాంకర్లు నీటిని అందించామని, బోరు మోటార్లు వేయించామని అన్నారు. 2014 నుంచి 2023 వరకు జరిగిన అభివృద్ధిని చూడాలని అన్నారు. అందరం సమష్టిగా పనిచేయడం ద్వారా ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనిచేశామన్నారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో పనిచేసిన వారిని ప్రజలు మర్చిపోరని అన్నారు. సిరిసిల్లలో వంద కోట్ల పనులు జరిగాయని, అండర్ డ్రైనేజీ పనులు కూడా చేసుకుందామని అనుకున్నప్పటికి మూడవసారి అధికారంలోకి వచ్చిన తరువాత చేసుకుందామని అనుకోవడం జరిగిందన్నారు. సిరిసిల్ల మున్సిపాలిటీకి రూ.40కోట్లు మంజూరుచేస్తే పగబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిధులు కూడా నిలిపివేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు కోటలు దాటడం తప్ప చేతులు మాత్రం రావడం లేదన్నారు. మహిళలకు రూ.2500, తులం బంగారం, స్కూటీ, రైతులకు రూ.15వేల భరోసాలేదని అన్నారు. గ్రామసభల్లో ప్రజలు నీలదీస్తున్నారని ప్రభుత్వం మీద కోపంతో అధికారులు బలి పశువులు అవుతున్నారని అన్నారు. ప్రజాపాలనలో కోటి 6లక్షల దరఖాస్తులు తీసుకున్నారని, కులగణన సర్వే ఇప్పుడు మళ్లీ ఇందిరమ్మ రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకోమ్మని చెబుతున్నారని అన్నారు. జిరాక్స్ సెంటర్ షాపులకు మాత్రమే గిరాకీ అవుతుందని అన్నారు. డైలాగ్‌లు చెప్పుడు మాకు కూడా వచ్చని, మోసపు మాటలు, బక్వాస్ తీరు మానుకొని పనిచేయాలని అన్నారు. నూరు రోజులో ఇస్తామన్న ఆరు గ్యారెంటీలకు 400 రోజులైనా ఒక్క గ్యారెంటీ అమలు కాలేదన్నారు. పోయింది అధికారం మాత్రమే కానీ ప్రజల్లో మనపై అభిమానం పోలేదన్నారు. పదవీకాలం ముగిసినా పోరాట పటిమతో ప్రజలతోనే ఉండాలన్నారు. పట్టణ ప్రగతి పనులే కాకుండా సఫాయికి సలామ్ అన్న కేసీఆర్ జీతాలు ఇచ్చారని అన్నారు. కరోనా సమయంలో పనిచేసిన తీరు చరిత్ర మర్చిపోదని అన్నారు.

కేటీఆర్‌కు భంగపాటు..

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడానికి వచ్చిన బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు సిరిసిల్ల ఎమ్మెల్యే కే తారకరామారావుకు భంగపాటు ఎదురైంది. 2019లో సిరిసిల్ల పట్టణంలో పొదుపు సంఘాల సభ్యుల కోసం సుభాష్‌నగర్‌లో రూ.85లక్షల వ్యయంతో కమ్యూనిటీ భవన నిర్మాణం చేపట్టారు. కేటీఆర్ చేతుల మీదుగానే శంకుస్థాపన కార్యక్రమం కూడా చేసుకున్నారు. భవనం పనులు పూర్తయిన క్రమంలో శుక్రవారం కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రారంభోత్సవానికి కొద్ది గంటల ముందే మున్సిపల్ కమిషనర్ లావణ్య ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్‌కు తాళం వేసి వచ్చిన మహిళలను పంపించి వేశారు. ఎందుకు రద్దు పరిచారనే దానికి అధికారుల నుంచి సరైన సమాధానం లేదు. పనులు పూర్తికాలేదనే విషయం చెబుతూ వచ్చారు. కానీ శిలాఫలకంపై పేర్ల వివాదమే కారణంగా భావిస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ పేదల పక్షపాతి

- పార్లమెంట్ కోకన్వీనర్ చక్రధర్‌రెడ్డి

ముస్తాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని పార్లమెంట్ కోకన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కనమేని చక్రధర్‌రెడ్డి మాట్లాడుతూ దావోస్ పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో పెద్దఎత్తున పెట్టుబడులు తీసుకువచ్చారన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే పెట్టుబడులు ఎక్కువగా వచ్చాయని, ఉద్యోగవకాశాలు మెరుగుపడ్డాయని అన్నవారిక దావోస్ పర్యటన చెంపపెట్టని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులనే విజయం వరిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ అంజనేయరావు, ఏఎంసీ డైరెక్టర్‌లు కుంబాల యాదగిరిరెడ్డి, ప్రతాపరెడ్డి, మాజీ సర్పంచ్‌ల ఫోరం కన్వీనర్ కలకొండ కిషన్‌రావు, మాజీ కోఆప్షన్ షాదుల్‌పాష, మాజీ వైస్ ఎంపీపీ ఎల్లాగౌడ్, యువజన అధ్యక్షులు రంజాని నరేశ్, బండి శ్రీకాంత్, ముద్దం రాజు, శ్రీనివాస్‌రెడ్డి, ముత్యాల దేవేందర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ముస్తాబాద్ ఏఎంసీ ఛైర్మన్ తలారి రాణి నర్సయ్య కుటుంబసభ్యుడు బాబు అనారోగ్యంతో మరణించగా శుక్రవారం పరామర్శించారు. అలాగే ముస్తాబాద్‌లో తాళ్ల బాల్‌రెడ్డి భార్య గుండెపోటుతో మరణించగా బాల్‌రెడ్డి అతని కుమారులు శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌రెడ్డిలను చక్రధర్‌రెడ్డి పరామర్శించి ఓదార్చరు. అకాల మరణంపై విచారం వ్యక్తం చేశారు.

బాలికల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం - ఘనంగా బాలికా దినోత్సవం



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం

గంభీరావుపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : బాలికల సంక్షేమా నికి ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా సంక్షేమ అధికారి పి లక్ష్మీరాజం అన్నా రు. జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం గంభీరా వుపేట మండలం నర్మల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి పి లక్ష్మీ రాజం ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వసతి గృహాల్లోని బాలికలకు పౌష్టికాహారం అందించేలాగా ఏర్పాట్లు చేశారన్నారు. ప్రతి పాఠశాలలో ఒకేరకమైన డైట్ మెనూ ప్రకటించి అమలుచేస్తున్నారన్నారు. బాలికలు, మహిళల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కార్యక్రమాలు చేపడుతున్నాయని వివరించారు. తదనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థినులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ఉమారాణి, ప్రిన్సి పాల్ సృజన, డీహబ్ కోఆర్డినేటర్ రోజా, దేవిక, రమ్య, సఖి సిబ్బంది, రేణుక, వైస్‌ప్రిన్సిపాల్ సౌజన్య, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ సరిత, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

● చందుర్తి : మండలంలోని నర్సింగాపూర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. ఇంగ్లీష్ 'గర్ల్స్' ఆకారంలో విద్యార్థులు కూర్చున్నారు. ప్రధానోపాధ్యాయులు జలంధర్‌రెడ్డి, ఉపాధ్యా యులు అనిత, రాజు, రమేష్, ప్రణవి, లాస్యలు పాల్గొన్నారు.

పర్యాటక శోభ ఏదీ..?
- ధార్మిక, కార్మిక క్షేత్రానికి పర్యాటక సొబగులు
- టెంపుల్ టూరిజం వైపు అడుగులు 7

ఎస్సీ వర్గీకరణ అమలుకు ఇదే అసలైన సమయం..
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ 6

బాలుడిపై లైంగిక దాడి?

వేములవాడ టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల బాలుడిపై 14ఏళ్ల బాలుడు లైంగికదాడికి పాల్పడినట్లు తెలిసింది. వేములవాడ మున్సిపల్‌పరిధిలోని ఓ కాలనీకిచెందిన బాలుడిపై గురువారం సాయంత్రం అదేకాలనీకి చెందిన 14ఏళ్ల బాలుడు అఘాయిత్యానికి పాల్పడడంతో బాలుడికి తీవ్ర రక్తస్రావమైంది. విషయం తల్లిదండ్రులకు తెలియడంతో బాలుడిని ఆసుపత్రికి తరలించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. పోలీసులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

ఇల్లంతకుంట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో మండలంలోని అనంతగిరి గ్రామానికి చెందిన వెదిరె పరశురాంను అరెస్టు చేసినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి శుక్రవారం పేర్కొన్నారు. సీఐ తెలిపినవివరాల ప్రకారం.. కరీంనగర్ జైలులో జీవితఖైదు శిక్ష అనుభవిస్తున్న పరశురాంకు కరీంనగర్‌కు చెందిన బాధితురాలితో పరిచయం ఏర్పడింది. గతనెల 24న పెరోల్‌పై బయటకు వచ్చిన పరశురాం కరీంనగర్‌లో ఉన్న బాధితురాలి వద్దకు వెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈనెల 20న బాధితురాలిని తన ద్విచక్రవాహనంపై కరీంనగర్ నుంచి అనంతగిరి గ్రామానికి తీసుకవెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం పెద్దలింగాపూర్ గ్రామం వైపు ద్విచక్రవాహనంపై తీసుకొని వెళుతుండగా బాధితురాలు కేకలు వేయగా పరశురాం పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు శుక్రవారంఅనంతగిరి గ్రామసమీపంలో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడిపై గతంలో హత్య కేసుఉండగా జీవితఖైదు అనుభవిస్తున్నట్లు సీఐ తెలిపారు. సీఐ వెంట ఎస్సై కదిరె శ్రీకాంత్‌గౌడ్‌తోపాటు పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

భీమారం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలకేంద్రానికి చెందిన చెరుకూరి లక్ష్మి(52) అనే మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. లక్ష్మి కొన్నిరోజుల నుంచి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన లక్ష్మి శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు లక్ష్మి కూతురు గుడ్ల స్వప్న ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యామ్‌రాజు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు సంతానం కాగా అందరికీ వివాహాలు అయ్యాయి. కొడుకు ప్రస్తుతం గల్ఫ్ దేశంలో ఉంటున్నాడు.

విచ్చలవిడిగా గంజాయి



- వాట్సప్ గ్రూపుల ద్వారా అమ్మకాలు

జమ్మికుంట రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంతోపాటు మండల వ్యాప్తంగా గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. గడిచిన ఏడాది కాలంలో గంజాయి విక్రయిస్తూ పోలీసులకు చిక్కిన వారిలో మహిళలు ఎక్కువగా ఉండడం విశేషం. మహిళల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని గంజాయి ముఠాలు వారిని ఈ ఊబిలోకి దింపుతున్నాయి. మహారాష్ట్ర నుంచి రైలు మార్గంలో వస్తువుల మధ్య గంజాయి ప్యాకెట్లు పెట్టి జమ్మికుంట రైల్వే స్టేషన్‌కు తీసుకు వస్తున్నారు. రైల్వే స్టేషన్‌ను ఆనుకొని ఉన్న కొత్తపల్లి నుంచి ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది.



మత్తుతో చిత్తు అవుతున్న యువత..

గంజాయి మత్తుకు ఎక్కువగా యువకులు బానిసలవుతున్నారు. వారిలో ఎక్కువగా 18 నుంచి25ఏళ్ల మధ్య వయస్సు వారు ఉంటున్నారు. మొదట సిగరెట్లకు అలువాటు పడుతున్న యువత తర్వాత గంజాయి వైపు మరలుతున్నారు. నిర్మానుష్య ప్రాంతాలను అడ్డాగా చేసుకుని గంజాయి సేవిస్తున్నారు. మొదట సిగరేట్ ప్యాకెట్లు కొనుగోలు చేసి, అందులోని పొగాకు బయటకు తీసి గంజాయితో నింపి సేవిస్తున్నారు.గంజాయి కొనుగోలు చేసే వ్యక్తుల కోసం ప్రత్యేకంగా వాట్సప్ గ్రూప్‌లు ఏర్పాటు చేశారు. తమకు ఎంత మేరా గంజాయి కావాలో గ్రూపులో పోస్ట్ చేస్తే సదరు అడ్రస్‌కు క్షణాల్లో గంజాయిని చేర్చుతున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా ఇందుకు ఖరీదైన బైక్‌లు వాడుతున్నారు.

గంజాయి సేవించి వింత ప్రవర్తన..

తక్కువ ధరకు ఎక్కువ కిక్కు ఇస్తుండడంతో యువత గంజాయి వైపు ఆకర్షితులవుతున్నారు. గంజాయి సేవించిన తర్వాత వారి ప్రవర్తన వింతగా మారుతోంది. బైకులపై అతి వేగంగా ప్రమాదాలకు కారణమవుతున్నారు.

నిందితుడికి ఆరు నెలలు జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు కేసుల్లో నిందితుడు అశోక్‌కు ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.100జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల సీఐ కృష్ణ తెలిపారు. సిరిసిల్ల పట్టణం బీవై నగర్‌కు చెందిన ఎం భాస్కర్ అనే వ్యక్తి బైక్‌పై రాజీవ్‌నగర్ నుంచి బీవైనగర్ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న సిరిసిల్ల పట్టణం సంజీవయ్యనగర్‌కు చెందిన యాలకుల అశోక్ అనే వ్యక్తి ఢీకొన్నాడని ఆయన తెలిపారు. దీంతో అశోక్, భాస్కర్‌తో గొడవ పడుతూ తాను పోలీసునని, తన మోటార్‌సైకిల్‌తో ఢీకొంటావా అంటూ రూ.3వేలు జరిమానా కట్టమని భాస్కర్‌ని బెదిరించాడన్నారు. డబ్బుల్లేవని బతిమిలాడినా వదలకుండా బలవంతంగా అశోక్ అనేవ్యక్తి భాస్కర్ ఏటీఎం కార్డు తీసుకొని డ్రాచేసుకున్నాడని ఆయన తెలిపారు. కొద్దిసేపటి తరువాత అతను పోలీస్ కాదని, డ్రైవర్ అని తెలుసుకొని భాస్కర్ అనేవ్యక్తి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు నమోదు చేసి విచారణ అనంతరం అప్పటి ఎస్ఐ బి శ్రీనివాస్ అరెస్ట్ చేసి రిమాండ్ చేశారన్నారు. మరోదొంగతనం కేసులో అశోక్‌కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.100 జరిమానా విధించారని ఆయన తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుడికి ఏడు నెలలు..

ఇల్లంతకుంట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలోని ఎల్లమ్మ గుడి ఆలయంలో జరిగిన దొంగతనం కేసులో సూర దేవేందర్ అనే నిందితుడికి సిరిసిల్ల రెండవ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి గడ్డం మేఘన జైలుశిక్ష విధించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ పేర్కొన్నారు. రెండు సంవత్సరాల క్రితం రేణుకాదేవి ఆలయంలో హుండీని పగలగొట్టి దేవేందర్ నగదు ఎత్తుకెళ్లాడు. కోర్టులో నేరం నిరూపణ కావడంతో న్యాయమూర్తి 17 నెలల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

ఇల్లందకుంట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన చందగల్ల సాంబయ్య(60) చికిత్సపొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారుతెలిపిన వివరాల ప్రకారం.. మృతుడికి సరిగా మతిస్థిమితంలేదు. ఈ నెల20న ఇంట్లో ఎవరూలేని సమయంలో మద్యంతాగి, తలుపులు పెట్టుకొని ఇంటికి నిప్పటించాడు. దీంతో సాంబయ్యకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు మంటలను ఆర్పిఅతనిని వరంగల్ ఎంజీఎంకు తరలించారు.చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్సపొందుతూ వృద్ధురాలు మృతి



మృతి చెందిన సావిత్రి

కరీంనగర్ అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కరీం నగర్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న సావిత్రి(60) అనే వృద్ధు రాలు మృతిచెందిందని అవుట్‌పోస్ట్ హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్ తెలిపారు. రామ గుండం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి గురువారం 108సిబ్బంది అంబులెన్స్‌లో సావిత్రిని తీసుకొచ్చి కరీంనగర్ ప్రభుత్వాస్పత్రిలో అడ్మిట్ చేశారు. సావిత్రికి సంబంధించిన వారు ఎవరూ లేరని, ఆమెను గుర్తించినవారు కరీంనగర్ ప్రభుత్వాస్ప త్రిలోని అవుట్‌పోస్ట్ పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి



గౌతమి (ఫైల్)

తిమ్మాపూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూరు శివారు మానకొండూరు వెళ్లే రహదారిపై గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహ నాన్ని ఢీకొన్న సంఘటనలో మహిళ మృతిచెందగా మృతురాలి భర్తకు గాయాలయ్యాయి. ఎల్ఎండీ ఎస్ఐ వివేక్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూరు మండలం అన్నారం గ్రామానికి చెందిన రుద్రోజు శ్రీనివాసచారి తన భార్య గౌతమి(30) వారి ఇద్దరు చిన్నపిల్లలు పాప రసజ్ఞ(3), బాబు రుద్రాంష్ (8నెలలు)తో కలిసి పనినిమిత్తం కరీంనగర్‌కు వారి ద్విచక్రవాహనం (టీఎస్02ఎఫ్‌బి 6995)పై వెళ్లారు. పని ముగించుకుని తిరిగి అన్నారంకు బయలుదేరి వెళుతుండగా అలుగునూరు శివారులోని లక్ష్మినరసింహా ఫంక్షన్‌హాల్ సమీపంలో గుర్తుతెలియని వాహనం వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుకనుంచి ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ సంఘటనలో ద్విచక్రవాహనంపై వెనకాల కూర్చున్న గౌతమి కిందపడిపోగా ఆమె తలపై నుంచి వాహనం వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త శ్రీనివాస్‌చారికి కాళ్లకు, చేతులకు గాయాలయ్యాయి. పిల్లలు మాత్రం ఎలాంటి గాయాలు కాకుండా బయటపడ్డారు. శ్రీనివాసచారిని చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్ఐ వివేక్ తెలిపారు.

సైదాపూర్ మండలంలో ఒకరు..

సైదాపూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని ఘణపూర్ గ్రామానికి చెందిన గుంటి శ్రీనివాస్(38) గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ దుద్దెనపల్లిలోని తన బంధువులు మృతి చెందగా, అంత్యక్రియలకు తన ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈక్రమంలో దుద్దెనపల్లి, సైదాపూర్ మధ్య గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అనారోగ్యంతో ఒకరు..

హుజూరాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో శుక్రవారం గణేష్‌నగర్‌కు చెందిన సోయం రాజు(30) అనే వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందినట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు. గణేష్‌నగర్‌కు చెందిన రాజు ఐదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనికితోడు అతడు మద్యానికి బానిసవగా శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

మండల సరిహద్దులో పులి సంచారం..

- రాత్రి వేళల్లో రైతులు పొలాల వద్దకు వెళ్లవద్దు

చందుర్తి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాలమండల సరిహద్దుల నుంచి చందుర్తి మండల సరిహద్దుల్లో పులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించినందున మండల రైతులు, గొర్రెలకాపర్లు అప్రమత్తంగా ఉండాలని చందుర్తి ఎస్ఐ అంజయ్య, అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రాఘవేందర్‌రావులు శుక్రవారం తెలిపారు. కొడిమ్యాల మండలంలోని కొండాపూర్ శివారులో పులి ఓ ఆవును చంపిందని, మండలంలోని తిమ్మాపూర్, రామన్నపేట, నర్సింగాపూర్ గ్రామాల శివారులో సంచరిస్తోందన్నారు. రాత్రి సమయంలో రైతులు పొలాల వద్దకు వెళ్లకూడదని, మధ్యాహ్న సమయంలో కూడా ఒంటరిగా వెళ్లకూడదన్నారు. రాత్రి సమయంలో పొలాల వద్ద ఎలాంటి విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయకూడదన్నారు. ఎలాంటి సమాచారం తెలిసినా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లోని ఆవునూర్ మూలమలుపు వద్ద శుక్రవారం ఇసుక ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో వెంకటాపూర్, ముస్తాబాద్ మండలం ఆవునూర్ గ్రామాలకు చెందిన నర్సయ్య, సురేశ్‌లు తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నర్సయ్య, సురేశ్‌లు తమ ద్విచక్రవాహనంపై వెంకటాపూర్ నుంచి ఆవునూర్ వైపు వెళుతున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ అతివేగంగా ఢీకొట్టింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ బస్టాండు ప్రాంతంలో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై గురువారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన హీక్యానాయక్ తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. హీక్యానాయక్ తన ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళుతున్న క్రమంలో కామారెడ్డి నుంచి ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం హీక్యానాయక్‌ను ఢీకొట్టింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

అనారోగ్యంతో ఎంఈవో మృతి

ఎల్లారెడ్డిపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి ఎంఈవోగా విధులు నిర్వహిస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఈసరి రవీందర్(57) అనారోగ్యంతో వరంగల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు. రవీందర్ కొంతకాలంగా మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతున్నారు. పరిస్థితి విషమంగా మారడంతో వరంగల్‌కు తరలించగా చికిత్స పొందుతూ చనిపోయారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన ఎల్లారెడ్డిపేటకు తీసుకురావడంతో స్థానికంగా విషాదం నెలకొంది. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

పోరాట యోధుడు సర్వాయి పాపన్న

- పాపన్న చరిత్ర దేశానికి చాటిచెప్పేలా పాపన్న గుట్టల అభివృద్ధి
- సర్వాయిపాపన్న నివసించిన ప్రాంతం సర్వాయిపేటను పర్యాటక కేంద్రంగా మారుస్తాం
- పాపన్న గుట్టల అభివృద్ధికి త్వరలోనే మరిన్ని నిధులు
- సైదాపూర్ మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్



సర్వాయి పాపన్న కోట అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సైదాపూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న అని రాష్ట్రరవాణా, బీసీసంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ఆయన సైదాపూర్ మండలం సోమారం గ్రామశివారులోని మోడల్‌స్కూల్‌ను సందర్శించారు. స్కూల్ అభివృద్ధికి రూ.60లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రహరీ కోసం రూ. 48లక్షలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.12లక్షలు మంజూరు చేస్తానన్నారు. వెన్నంపల్లిలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయసహకార సంఘం భవనాన్ని ప్రారంభించారు. అనంతరం సర్వాయిపేట శివారులోని కొమ్ము గుట్ట వద్ద ఉన్న సర్వాయిపాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్వాయి పాపన్న గుట్టలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు మంజూరు చేసిన రూ.4.70కోట్ల నిధులతో చేపట్టే పనుల ప్రారంభానికి శంకుస్థాపన, భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో మంత్రి పొన్నంప్రభాకర్ మాట్లాడుతూ సర్దార్‌సర్వాయి పాపన్న చరిత్రను దేశానికి చాటి చెప్పేలా పాపన్న నివసించిన ప్రాంతాన్ని అభివృద్ధిచేసి, పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దుతామన్నారు. ప్రస్తుతానికి సర్వాయిపేటగ్రామంలో సర్వాయిపాపన్న కోట అభివృద్ధికి మంజూరు చేసిన రూ.4.70కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. త్వరలోనే ఈ ప్రాంతం అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేస్తామన్నారు. సర్వాయిపేట కోట పనులు పూర్తయ్యాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ప్రారంభోత్సవం చేయిస్తామన్నారు. మరిన్ని నిధులతో మరోదశ అభివృద్ధిని కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలాసత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, ట్రైనీకలెక్టర్ అజయ్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, సహకార సంఘాల అధ్యక్షులు కొత్త తిరుపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, తెలంగాణగౌడ సంఘం అధ్యక్షుడు భువనగిరి యాదగిరిగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూ వ్యవహారంలో బెదిరింపులకు పాల్పడిన ముగ్గురి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): విక్రయించిన భూమిని తిరిగి అప్పగించాలని బెదిరింపులకు పాల్పడిన సిరిసిల్ల పట్టణంలోని బి.వై.నగర్‌కు చెందిన దండుగుల రాజు(48)తో పాటు కోనరావుపేట మండలంలోని నిజామాబాద్ గ్రామానికి చెందిన మెరుగు లక్ష్మన్(48), కోనరావుపేటకు చెందిన ముదాం ప్రసాద్(46) అనే ఇద్దరు మాజీనక్సలైట్‌లను శుక్రవారం అరెస్ట్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని వెంకటేశ్వర టెంపుల్ వీధికి చెందిన మర్రిపల్లి శ్రీనివాస్, అతడి సోదరులు కలిసి 2016లో స్థానిక నెహ్రూనగర్‌కు చెందిన నక్కరాజు వద్ద పెద్దూరు శివారులోని సర్వేనంబర్ 55జీలో 3.16ఎకరాల భూమిని కొనుగోలుచేసి వ్యవసాయం చేసుకుంటున్నారని ఆయన తెలిపారు. 2015లో దండుగుల యాదమ్మ వద్ద నక్కరాజు అనే వ్యక్తి అట్టి భూమి కొనుగోలు చేయగా తర్వాత ధర పెరగడం వల్ల వారు అమ్మిన భూమిని ఎలాగైనా దక్కించుకోవాలనే ఉద్దేశ్యంతో మర్రిపల్లి శ్రీనివాస్‌ను ఎంత బెదిరించినా భయపడకపోవడంతో దండుగుల రాజు మాజీ నక్సలైట్ మెరుగు లక్ష్మన్, ముదాం ప్రసాద్‌లతో కుమ్మక్కై వారిని బెదిరించి భూమి లాక్కొని సగం సగం తీసుకోవాలని ప్రయత్నించారని తెలిపారు. ఇదే క్రమంలో పలుమార్లు శ్రీనివాస్‌ను బెదిరించి దౌర్జన్యంగా ఆక్రమించుకోవాలని చూడగా అప్పటికే దండుగుల రాజు, అతని తల్లి యాదమ్మ, భార్య లక్ష్మిలపై ఐదు కేసులు నమోదు అయ్యాయని ఆయన తెలిపారు. అయినప్పటికీ మర్రిపల్లి శ్రీనివాస్ భూమిని లాక్కోవాలనే ఉద్దేశ్యంతో జనవరి19న చంపుతామని బెదిరించారని, అంతేకాకుండా నక్కరాజు వద్ద రూ.16 లక్షల అప్పు తీసుకొని దానికి బదులుగా 3.16 ఎకరాల భూమి కుదువ పెట్టినట్లుగా తప్పుడు పత్రాలు సృష్టించి దానిని చూపిస్తూ భూమి తమ వారిదేనని బెదిరించారని ఆయన తెలిపారు. శ్రీనివాస ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి ముగ్గురు నిందితులను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ అమలుకు ఇదే అసలైన సమయం

- ఎవరు అడ్డుపడినా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సాధిద్దాం
- ఇంటికో డప్పుతో కదలండి.. విజయవంతం చేయండి..
- ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో లక్ష డప్పులు మోగిద్దాం..
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



ర్యాలీలో డప్పు కొడుతున్న మందకృష్ణ మాదిగ

సిరిసిల్ల క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల వర్గీకరణ అమలుకు ఇదే అసలైన సమయమని, ఎవరు అడ్డుపడినా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సాధిద్దామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని కె కన్వెన్షన్‌లో 'లక్ష డప్పులు.. వేల గొంతుల కార్యక్రమానికి తరలి రండి' సభ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొనపురం లక్ష్మణ్ మాదిగ అధ్యక్షతన భారీసభ నిర్వహించారు. ముందుగా సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి మందకృష్ణ మాదిగ పూలమాలలు వేసి, అంబేద్కర్ చౌరస్తా నుంచి కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వరకు డప్పు చప్పుళ్లతో భారీర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు... వేలాది గొంతులు అనే కార్యక్రమానికి ప్రతి ఇంటి నుంచి డప్పులతో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. డప్పులు లేకుండా రావద్దన్నారు. ఈ మహత్తర సాంస్కృతిక కార్యక్రమంపై ప్రపంచమే మనవైపు ఎదురు చూస్తోందన్నారు. ఎస్సీ వర్గీకరణ ఇపుడు అమలు చేయకపోతే ఎపుడూ చేయలేమన్నారు. ఎస్సీలలో 58కులాలు ఒక వైపు ఉంటే ఒకే ఒక్క మాలలు మరోవైపు ఉన్నారన్నారు. ప్రతి 100మందిలో 80మంది మాదిగలుంటే 20మంది మాలలు ఉన్నారన్నారు. ఈ విధంగా రిజర్వేషన్లలోనూ అన్యాయం జరుగుతోందన్నారు. చెప్పులు కుట్టి, డప్పులు కొట్టి మాదిగలు సమాజానికి సేవ చేశారని, సాంప్రదాయ వాయిద్యంగా డప్పు చూసి గర్వపడాలన్నారు. ప్రతి ఇంటిలో డప్పులు ఉండాలని, ప్రతి మాదిగ బిడ్డ వెంటనే డప్పుకొని ఇంట్లో పెట్టుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం సాధించిన విజయఫలాలను మాదిగ బిడ్డలకు చేరకుండా మాలల వర్గం కుట్రలు చేస్తోందన్నారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు ఆగస్టు 1న ఏడుగురు జడ్జీల ధర్మాసనంలో ఆరుగురు జడ్జీలు అనుకూలంగా ఉండి రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఉందని తీర్పు ఇచ్చిందన్నారు. నాలుగు నెలలైనా తెలంగాణలో అమలు చేయడంలేదని, తీర్పువచ్చిన రోజు అసెంబ్లీలో సీఎం అనుకూలంగా మాట్లాడారన్నారు. ఎస్సీ వర్గీకరణకు మాలల వర్గమే అడ్డుపడుతోందన్నారు. కార్యక్రమంలో ఉద్యమనాయకులు దరువు అంజన్న, ఏపూరి సోమన్న, భరత్, అశోక్, సంజీవ్ తదితర కళాకారులు డప్పు చప్పుళ్లు, ఆట పాటలతో హోరెత్తించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాసు, సెస్ డైరెక్టర్ కొట్టపల్లి సుధాకర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఆవునూరి ప్రభాకర్, అంకని బాను, థామస్, ఎంఎస్‌పీ రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటస్వామి మాదిగ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి రుద్రారపు రాంచంద్రం మాదిగ, సత్యనారాయణ, బాలరాజు, లక్ష్మన్, దేవయ్య, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చంపుతామని బెదిరించిన ఇద్దరి అరెస్టు

వేములవాడ రూరల్, జనవరి24 (ఆంధ్రజ్యోతి): చంపుతామని బెదిరించిన ఇద్దరిని అరెస్టుచేసి రిమాండుకు తరలించినట్లు రూరల్‌సీఐ శ్రీనివాస్ తెలిపారు. సీఐ వెల్లడించిన వివరాల ప్రకారం.. బోయినిపల్లి గ్రామానికిచెందినశ్రీనివాస్ హోటల్ నడుపుకుంటూ జీవిస్తున్నాడు. కూతురి వివాహం నిశ్చయం కావడంతో డబ్బు అవసరమై తన ఇంటిని అమ్మదలచి ఓ విలేకరి సహాయం కోరాడు. అతడు వేములవాడకు చెందిన కడారి తిరుపతి అనే రౌడీషీటర్‌ను శ్రీనివాస్ దగ్గరకు తీసుకువచ్చి ఇల్లు కొనడానికి రూ.50వేలు అడ్వాన్స్‌గా ఇచ్చి ఒప్పందం చేసుకున్నారు. తర్వాత డబ్బులు పూర్తిగా చెల్లించకుండానే చంపుతానని బెదిరించి ఇంటి ఒరిజినల్ డాక్యుమెంట్లను తిరుపతి తీసుకెళ్లడంతో బాధితుడు శ్రీనివాస్ బోయినిపల్లి పోలీసులను ఆశ్రయించాడు. దీంతోపోలీసులు కడారి తిరుపతి, పత్రికా విలేకరిని పట్టుకుని వారి వద్ద నుంచి ఇంటిపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టుచేసి రిమాండుకు తరలించినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గంగాధర, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మధురానగర్‌లో పేకాట రాయుళ్లను పట్టుకున్నట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. మధురానగర్‌శివారులోని మామిడి తోటలో పేకాడుతున్నారని పక్కాసమాచారం మేరకు దాడిచేసినట్లు తెలిపారు. ఈదాడిలో 8మంది పేకాడుతుండగా పట్టుబడినట్లు ఆయన తెలిపారు. వారినుంచి రూ.20,500లు, 7సెల్‌ఫోన్లు, 4బైకులను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

'పొలాస'లో రైతులకు శిక్షణ


జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పొలాసలో శుక్రవారం యాసంగి వరిలో ప్రధాన సమస్యలు, యాజమాన్య పద్ధతులపై రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లా డుతూ వరిలో మొగిపురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ 3సీజీ ఎకరానికి 10కిలోల చొప్పున 20-25 కిలోలు ఇసుకను కలుపుకొని బురద పదనలో చల్లాలన్నారు. ఈ సమావేశంలో పరిశోధన స్థానం ఏడీఆర్ శ్రీనివాస్, శాస్త్రవేత్తలు బలరాం, స్వాతి, సాయినాథ్, రజినీకాంత్, మదన్‌మోహన్‌రెడ్డి, రజినీదేవి, శ్రీలక్ష్మీ, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల రైతులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్ కళాశాలల క్రీడలు ప్రారంభం

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్థాయి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడలు శుక్రవారం కరీంనగర్‌లోని అంబేద్కర్ ప్రభుత్వ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని 10 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 600 మంది విద్యార్థులు హాజరయ్యారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ అప్పారవు, డాక్టర్ రాజగోపాల్, అంబేద్కర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి, సిరిసిల్ల పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్ పరీక్షలు

తిమ్మాపూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ తొలివిడత ఆన్‌లైన్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని ఐయాన్ డిజిటల్ జోన్, శ్రీచైతన్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్, కరీంనగర్‌లోని వాణినికేతన్ డిగ్రీఅండ్‌పీజీ కళాశాలలో మొత్తం కలిపి నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నాలుగు పరీక్షా కేంద్రాల్లో కలిపి మొదటి సెషన్‌లో 967 మంది అభ్యర్థులకు 946మంది హాజరు కాగా 14మంది గైర్హాజరు అయ్యారు. రెండు సెషన్‌లలో కలిపి 1926మంది విద్యార్థులకు గాను 1891మంది హాజరు కాగా 35మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాలేదని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ టి లలిత కుమారి తెలిపారు.


సిరిసిల్ల మిడ్‌మానేరులో నిరుపయోగంగా బోటు

పర్యాటక శోభ ఏదీ?

- ధార్మిక, కార్మిక క్షేత్రానికి... పర్యాటక సొబగులు
- టెంపుల్ టూరిజం వైపు అడుగులు
- ప్రారంభోత్సవానికే పరిమితమైన మిడ్ మానేరు జల విహారం
- అనంతగిరి ప్రాజెక్ట్‌లో 40 ఎకరాల్లో ఐలాండ్

• 40 ఎకరాల్లో ఐలాండ్ అభివృద్ధికి మోక్షం కలిగేనా...?

ఇల్లంతకుంట మండలం అనంతగిరి వద్ద గుట్టలను అనుసంధానం చేస్తూ అన్నపూర్ణ, అనంతగిరి ప్రాజెక్టును నిర్మించారు. ఇక్కడే ఆసియాలోనే అతిపెద్ద సర్జ్ పూల్ బావిని కూడా నిర్మించారు. ప్రాజెక్టులో మధ్యలో ఉన్న 40 ఎకరాలతో ఉన్న గుట్టను ఐలాండ్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించినా ప్రతిపాదనలకు మోక్షం కలగడం లేదు. ప్రాజెక్ట్ వద్ద సిరిసిల్ల, కరీంనగర్, సిద్దిపేట జిల్లాల ప్రజలకు ఎంతో ఇష్టమైన పోచమ్మ తల్లి దేవాలయం కూడా ఉంది. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఇక్కడికి వచ్చే పర్యాటకులు, వేములవాడకు వచ్చే యాత్రికులకు ప్రాజెక్ట్ ఎంతో ఆహ్లాదాన్ని పంచుతుందని భావిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

కార్మిక, కర్షక, ధార్మిక ఆధ్యాత్మిక జిల్లాగా రాజన్న సిరిసిల్ల నిలుస్తోంది. జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నా పర్యాటకులకు నిరాశే కలుగుతోంది. దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న జిల్లాలోని వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. టెంపుల్ టూరిజానికి అవకాశం ఉన్నా గత ప్రభుత్వ హయాంలో అడుగులు పడలేదు. ప్రతిపాదనలకే పరిమితం అయ్యాయి. గత సంవత్సరం నవంబరులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు అభివృద్ధి శంకుస్థాపనలతో అతిపెద్ద శైవక్షేత్రంగా పేరొందిన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానాన్ని అద్భుతమైన రీతిలో తీర్చిదిద్దేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. గత ప్రభుత్వ హయాంలో భారీ నిధులతో అభివృద్ధి చేస్తామన్న హామీలు కాగితాల మీద డిజైన్లుగా మాత్రమే ఆకర్షించాయి. కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సమయంలో పీసీసీ అధ్యక్ష హోదాలో రేవంత్‌రెడ్డి వేములవాడ రాజన్నను దర్శించుకొని అభివృద్ధి చేస్తామని మాట ఇచ్చారు. మాటకు కట్టుబడి అధికారంలోకి రావడంతోనే బడ్జెట్‌లో రూ.50 కోట్లు నిధులు పొందుపర్చారు. దానికి అనుగుణంగానే వేములవాడలో ఇతర అభివృద్ధి పనులు దేవస్థానం ఆలయ విస్తరణకు రూ.127.65 కోట్లు మంజూరు చేస్తూ జీవోలు జారీ చేశారు. దీంతో పాటు భక్తులకు, పర్యాటకుల కోసం అన్నదాన సత్రం కూడా నిర్మిస్తున్నారు.

● ఎదురు చూపుల్లోనే... జల విహారం

శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్, అనంతగిరి ప్రాజెక్ట్, ఎగువ మానేరు ప్రాజెక్టుల వద్ద పర్యాటక హంగులు కల్పించే దిశగా గత ప్రభుత్వం హడావిడి చేసినా పర్యాటకులకు జల విహారం ఎదురుచూపులే మిగిల్చింది. శాసనసభ ఎన్నికల సమయంలో శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కరకట్ట వద్ద అప్పటి మంత్రులు బోటును ప్రారంభించి జలవిహారానికి నాంది పలికినా ప్రారంభోత్సవం తోనే నిలిచిపోయింది. దాదాపు మూడు సంవత్సరాలుగా సిరిసిల్ల ప్రజలు జలవిహారానికి ఎదురుచూసినా నిరాశపర్చింది. ఇప్పటికీ ప్రారంభించిన బోట్లు కరకట్ట వద్ద వెక్కిరిస్తూ కనిపిస్తున్నాయి. జిల్లాలోని మిడ్‌మానేరు, అన్నపూర్ణ రెండు ప్రాజెక్టులు పర్యాటకానికి కీలకంగా మారుతాయని భావించారు. దక్షిణ కాశీగా వేములవాడల శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ప్రసిద్ధి చెంది ఆధ్యాత్మికతకు పర్యాటకం తోడవుతుందని అనుకున్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకాలకు సిరిసిల్ల మానేరు తీరంలోని శ్రీరాజ రాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్, అన్నపూర్ణ అనంతగిరి ప్రాజెక్టులు ప్రధానంగా నిలుస్తాయి. ఈ ప్రాజెక్టుల వద్ద పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని 2021 జూలై 4న సిరిసిల్ల జిల్లా పర్యటనకు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అనంతగిరి పోచమ్మను దర్శించుకుంటానని అన్నపూర్ణ అనంతగిరి, శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టులను పర్యాటక అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని ప్రకటించారు. వేములవాడ ఆధ్యాత్మికతకు స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు పర్యాటకం కూడా స్వాగతం పలుకుతుందని భావించినా ఆచరణలోకి మాత్రం రాలేదు. మిడ్ మానేరు వద్ద కొడుముంజ గుట్టలకు కలుపుకొని రోప్‌వేలు, కాటేజ్‌ల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. అదేక్రమంలో మిడ్ మానేరు బ్యాక్ వాటర్ సిరిసిల్ల కరకట్ట వద్ద బోటును కూడా సిద్ధం చేసినా కొవిడ్‌తో ప్రారంభానికి నోచుకోలేదు. శాసనసభ ఎన్నికల క్రమంలో గత సంవత్సరం ఆగస్టు 18న హడావిడిగా, నామామాత్రంగా ప్రారంభోత్సవం చేసి వదిలేశారు.


అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లో మత్స్యకారులు (ఫైల్)

విజ్ఞానం.. వినోదం



- స్టూడెంట్... టూరిజం
- తెలంగాణ దర్శిని పేరుతో పర్యాటక ప్రాంతాల సందర్శన
- నేడు జాతీయ పర్యాటక దినోత్సవం

ప్రతి యేడాది జనవరి 25న దేశ వ్యాప్తంగా పర్యాటక దినోత్సవం జరుపుకుంటారు. భారతదేశ సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, సంప్రదాయ విలువల అభివృద్ధికి పర్యాటక రంగం తోడ్పడాలని టూరిస్ట్ ట్రాఫిక్ కమిటీ స్థాపించిన సందర్భంగా 1948 నుంచి జాతీయ పర్యాటక దినోత్సవాన్ని జరుపుతున్నారు. పర్యాటక రంగంలోని విభిన్న సంస్కృతులను ప్రోత్సహించడం, ఆయా పర్యాటక ప్రాంతాలను ప్రపంచానికి పరిచయం చేయడం, పర్యాటక ప్రాముఖ్యతను పెంచడమే లక్ష్యం.

సిరిసిల్ల/కరీంనగర్ కల్చరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) :దేశంలోని వివిధ ప్రాంతాలను, అక్కడి సంస్కృతులను తెలుసుకునేందుకు స్టూడెంట్ టూరిజంను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ విద్యా సంవత్సరం తెలంగాణ దర్శిని పేరిట పర్యాటక ప్రాంతాల సందర్శనకు అవకాశం ఇచ్చింది. ప్రభుత్వమే విహార యాత్రలకు అయ్యే ఖర్చులు భరిస్తుంది.

● పాఠశాలలో టూరిజం క్లబ్‌లు..

పాఠశాలల్లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం యువ టూరిజం క్లబ్‌లను కూడా ఏర్పాటు చేయనుంది. 7వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకునే విద్యార్థులకు టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేయనున్నారు. ప్రతి క్లబ్‌లో 25 మంది విద్యార్థులను సభ్యులుగా ఏర్పాటు చేస్తారు. పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తూ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడే లక్ష్యంగా క్లబ్‌లు పనిచేసే విధంగా చూస్తారు. క్లబ్‌ల ద్వారా విద్యార్థి స్థాయి నుంచే సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించనున్నారు.

● పర్యాటక, విజ్ఞాన విహార కేంద్రాలు

మిడ్ మానేరు ప్రాజెక్ట్, ఎగువ మానేరు ప్రాజెక్ట్, అన్నపూర్ణ ప్రాజెక్ట్, అర్బన్ పార్కులు, దిగువ మానేరు డ్యాం, ఉజ్వల, డీర్ పార్క్‌లు, ఎన్‌టీపీసీ రామగుండం, రామగిరి, ఎలగందుల, మొలంగూర్, కోటిలింగాల, జగిత్యాల, నగునూరు, మానకొండూరు కోటలు, సర్వాయి పాపన్న గుట్టలు, ధూళికట్ట బౌద్ధక్షేత్రం, వేములవాడ, గుండారం, బోల్, బుగ్గ, అక్కపల్లి, తోటపల్లి, మానకొండూరు, కొత్తపల్లి చెరువులు, కరీంనగర్ మ్యూజియం చూడదగ్గ ప్రాంతాలు. పొరుగు జిల్లాలోని బాస ర, అలీసాగర్, బొటానికల్ గార్డెన్, కోమటి చెరువులాంటి ప్రాం తాలను చూసే అవకాశం విద్యార్థులకు లభిస్తుంది.

పెద్దపులి సంచారంపై పరిశీలన

● నాలుగు బృందాల ఏర్పాటు

కొడిమ్యాల, జనవరి24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్‌లో ఆవుపై పెద్దపులి దాడి చేసి చంపడంతో అధికారులు, సిబ్బంది నాలుగు బృందాలుగా అటవీ ప్రాంతంలో పరిశీలిస్తున్నారు. పెద్దపెల్లి అటవీ కార్యాలయం నుంచి తీసుకొచ్చిన నాలుగు కెమెరా ట్రాప్‌లను కొండాపూర్ శివారు ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొడిమ్యాల రేంజర్ మొయినుద్దీన్ మాట్లాడారు. కారిడార్ ఆధారంగా ఎస్ 12 అనే పెద్దపులి సిర్పూర్ నుంచి ఖానాపూర్ మీదుగా ఈ నెల 22న రాత్రి కొండాపూర్ అటవీ ప్రాంతానికి చేరుకున్నట్లు భావిస్తున్నామన్నారు. పెద్దపులి ఒక రోజులో నాలుగు దిక్కుల్లో 25 కిలోమీటర్ల చొప్పున 100 కిలోమీటర్ల పరిధిలో తిరుగుతుందని, ఆవాసాన్ని ఏర్పాటు చేసుకొని ఉండడానికి ప్రయత్నిస్తుందని, లేదా ఆ ప్రదేశం నుంచి వెళ్లిపోతుందని తెలిపారు. పెద్దపులి సంచారంతో వేములవాడ మండలం ఫాజుల్‌నగర్ నుంచి కొండాపూర్, కొడిమ్యాల నుంచి కోనాపూర్, కోనాపూర్ నుంచి దమ్మయ్యపేట, దమ్మయ్యపేట నుంచి సూరంపేట అటవీ ప్రాంతాల్లో


అడవిలో పరిశీలిస్తున్న సిబ్బంది

పొలాల వద్దకు వెళ్లే రైతులను, పశువుల కాపరులను అప్రమత్తం చేస్తున్నట్లు చెప్పారు. పంట రక్షణ కోసం ఎవరైన ఉచ్చులు, విద్యుత్ తీగలు, ఉరులు ఏర్పాటు చేస్తే తొలగించాలన్నారు. రాత్రి పూట బయటకు రావద్దని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. డీఆర్వోలు ముషీర్ అహ్మద్ మోనిక, సెక్షన్ ఆఫీసర్లు రత్న, సుబ్బారావు ఉన్నారు.

● రక్షణ కోసం కర్రతో పొలాలకు వెళ్లండి


రేంజర్ మొయినుద్దీన్

కొడిమ్యాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : అటవీ ప్రాంతం గుండా పొలాలకు వెళ్లే రైతులతోపాటు గ్రామస్థులు రక్షణ కోసం కర్రకు చిన్న గంట కట్టుకొని వెంట తీసుకెళ్లాలని కొడిమ్యాల రేంజర్ మొయినుద్దీన్ సూచించారు. గురువారం మండలం లోని కొండాపూర్‌లో పెద్దపులి దాడిలో ఆవు మృతి చెందింది. ఈ సంఘటనలో శుక్రవారం కొడి మ్యాలలోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అటవీ ప్రాంతల గుండా గ్రామస్థులు రాకపోకలు సాగించవద్దన్నారు. అటవీ శాఖ వారు ఏర్పాటు చేసిన చెక్ గేట్లకు అభ్యంతరం చెప్పవద్దన్నారు. అన్నదాతలు ఒంటరిగా కాకుండా 8 నుంచి 10 మంది కలిసి వెళ్లిరావాలన్నారు. 10 మందిలో ఇద్దరు డప్పు చప్పుడు చేయాలని, మరో ఇద్దరు విజిల్ వేయాలని సూచించారు. పొలాల వద్ద మంచె ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామం నుంచి అర కిలో మీటరు కన్నా ఎక్కువ దూరం గొర్రెలు, పశువులను మేతకు తీసుకెళ్లొద్దన్నారు. ఉదయం పది తర్వాత వెళ్లాలని, సాయంత్రం నాలుగు గంటల వరకు ఇంటికి చేరుకోవాలని అన్నారు. గ్రామ రక్షణ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పశువుల కాపరులకు పులి సంచారం, పగ్ మార్కులు కనిపిస్తే గ్రామ రక్షణ కమిటీలకు, అటవీ శాఖ అధికా రులకు సమాచారం అందించాలన్నారు. గ్రామస్థులు వెళ్లే ప్రాంతాల సమాచారాన్ని గ్రామ రక్షణ కమిటీలకు తెలుపాలన్నారు. పెద్ద పులికి ఎవరూ హాని చేయవద్దని, వలలు, ఉచ్చులు విద్యుత్ వైర్లు ఏర్పాటు చేయవద్దని పేర్కొన్నారు. పులికి హాని కలిగించే వ్యక్తులపై వన్యప్రాణి రక్షణ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. రేంజర్ వెంట డిప్యూటీ రేంజర్ ముషీర్ అహ్మద్ ఉన్నారు.

శివరాత్రికి ముస్తాబవుతున్న రాజన్న ఆలయం

● ఆలయ గోపురాలకు రంగులు

వేములవాడ కల్చరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయం మహాశివరాత్రి జాతరకు ముస్తాబవు


రాజన్న ఆలయ గోపురాలకు రంగులు వేస్తున్న కార్మికులు

తోంది. మూడు రోజులపాటు నిర్వహించే మహాశివ రాత్రి జాతరను పురస్కరించుకొని ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో పనులు చకచకా నిర్వహిస్తు న్నారు. ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు, ఆలయ గోపురాలకు రంగులు వేస్తున్నారు. మహాశివ రాత్రికి రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా చర్యలు తీసుకోనున్నట్లు ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు.

● రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకొని, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.


రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

తెలంగాణ అభివృద్ధికి సహకరిస్తాం

- కేంద్ర పట్టణాభివృద్ధి, విద్యుత్, గృహనిర్మాణశాఖ మంత్రి మనోహర్‌లాల్‌ఖట్టర్
- కరీంనగర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన


కేంద్ర మంత్రి ఖట్టర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని కేంద్ర పట్టణాభివృద్ధి, విద్యుత్, గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్‌లాల్‌ఖట్టర్ అన్నారు. కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. మల్టిపర్పస్ పార్కు, అంబేద్కర్ స్పోర్ట్స్ కాంప్లెక్సు, ప్రతిరోజూ నిరంతరం నల్లానీటి సరఫరా, ఈక్లాస్ రూమ్స్‌ను కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాటాడారు. కేంద్రమంత్రి మనోహర్‌లాల్‌ఖట్టర్ ప్రియమైన కరీంనగర్ ప్రజలారా నమస్తే... అంటూ తెలుగులో మాట్లాడటం ప్రారంభించి రెండు నిమిషాలపాటు తెలుగులోనే ప్రసంగించి అందరినీ ఆకట్టుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని మా ప్రభుత్వం గత పదేళ్లలో 10 లక్షల కోట్లకు పైగా నిధులను తెలంగాణ అభివృద్ధి కోసం, ఇక్కడి ప్రజల సంక్షేమం కోసం ఖర్చు చేసిందన్నారు. కేంద్రం కేటాయించిన నిధులను సకా లంలో ఖర్చు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫల మైందన్నారు. ప్రభుత్వాలు, పార్టీలు వేరైనా కేంద్రం, రాష్ట్రం కలిసికట్టుగా ముందుకెళ్లాల్సిన అవసరముందని అన్నారు. తెలంగాణ విషయంలో కేంద్రం వివక్ష చూపుతుందంటూ చేస్తున్న ప్రచారాన్ని ఖండించారు. తెలంగాణలో రైల్వే లైన్లు, స్టేషన్ల అభివృద్ధికి గత పదేళ్లలో రూ. 32,946కోట్లను కేటాయించి రాష్ట్రంలో రైల్వే స్టేషన్ల రూపురేఖలే మారుస్తున్నామని చెప్పారు. రామగుండంలో యూరియా పరిశ్రమ ఏర్పాటు చేసి ఎరువుల కొరత లేకుండా చేసిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనని కేంద్రమంత్రి ఖట్టర్ అన్నారు. రోజ్‌గార్ మేళా పేరుతో ఎలాంటి అవినీతికి, జాప్యానికి తావు లేకుండా నిర్ణీత వ్యవధిలో పరీక్షలు నిర్వహించి 9.25 లక్షల మందికి నియామక పత్రాలు అందించామన్నారు.

● కరోనాను అరికట్టడంలో కరీంనగర్ ఆదర్శం

కరోనా సమయంలో ఒకేసారి 13 పాజిటివ్ కేసులు ఈ కరీంనగర్‌లోనే మొదటిసారి వచ్చాయని


అంబేద్కర్ స్టేడియంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్

కేంద్ర మంత్రి మనోహర్‌లాల్‌ఖట్టర్ అన్నారు. ఆ సమయంలో మొదటిసారి గెలిసిన ఎంపీ బండి సంజయ్.. వైద్య సిబ్బందికి అండగా నిలిచి అతనే నేరుగా.. జిల్లా ఆసుపత్రిని సందర్శించిన వార్తలు తాను చూశానన్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో క్వారంటైన్ విధానాన్ని మొదటిసారి అవలంభించి కరోనా వ్యాప్తి చెందకుండా అరికట్టారన్నారు. వ్యాక్సినేషన్ విషయంలోనూ ఇక్కడే మొదటిసారి అందరికీ పూర్తి చేసి ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. వాటర్ ప్లస్ కార్యక్రమంలో భాగంగా.. కరీంనగర్ కార్పొరేషన్‌లో వాడిన నీటిని మళ్లీ యుటిలైజేషన్ చేసే విషయంలో 2023లో కరీంనగర్ మంచిస్థానంలో నిలిచిందని అన్నారు. నిధులను సక్రమంగా వినియోగించుకోవడంలో కరీంనగర్ ముందంజలో ఉందని అన్నారు. కరీంనగర్ స్మార్ట్ సిటీలో భాగంగా కమాండ్ కంట్రోల్ ఆధునీకరించారని, దీనితో ప్రజల భద్రతకు మరింత మేలు జరుగుతుందని అన్నారు. స్మార్ట్‌క్లాస్ ద్వారా పేద విద్యార్థులకు మెరుగైన బోధన అందుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వీధి వ్యాపారుల కోసం పట్టణాల్లో అమలు చేస్తున్న పీఎం స్వనిధి పథకం అమలు విషయంలో కరీంనగర్ దేశంలో రెండో స్థానంలో నిలిచిందన్నారు. ఇక్కడ దాదాపు 1200 మంది వీధి వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం నుంచి రుణసహాయం అందుతుందని అన్నారు. కరీంనగర్‌లో డంపింగ్ యార్డు సమస్యను పూర్తిగా పరిష్కరించేందుకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక సహాయాన్ని కేంద్రం అందిస్తుందని మంత్రి ఖట్టర్ హామీ ఇచ్చారు.

కరీంనగర్ జిల్లా అభివృద్ధిలో నెంబర్ వన్‌గా నిలిపేందుకు కృషి

● మంత్రి పొన్నం ప్రభాకర్



రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా జిల్లా అభివృద్ధిలో నెంబర్‌వన్‌గా ఉండేందుకు అందరూ సహకరించాలని అన్నారు. డంపుయార్డు సమస్య పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, కేంద్ర ప్రభుత్వం కూడా సహక రించాలని కోరారు. కరీంనగర్ స్మార్ట్‌సిటీకి మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తోపాటు ఎంపీగా తాను, ప్రస్తుతం ఎంపీ, మంత్రి సంజయ్ కృషిచేశామని చెప్పారు.

సొంతింటి కల సాకారం చేసుకునేలా చూడాలి

● మంత్రి పొంగులేటి



రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత వరంగల్, కరీంనగర్, ఖమ్మం నగరాల్లో స్వంతింటి కలను సాకారం చేసుకునేందుకు ఇళ్లను మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద తెలంగాణకు 8శాతం ఇండ్లు ఇవ్వాల్సి ఉండగా కేవలం 0.7శాతం మాత్రమే ఇండ్లు వచ్చాయని అన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన వాటా మేరకు సంక్షేమ పథకాలు, నిధులు తెచ్చేందుకు తెలంగాణకు చెందిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ కృషిచేయాలని శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

దొంగతనాల నివారణకు గస్తీ ముమ్మరం..

- శ్రీకాంత్, ఎస్సై గంభీరావుపేట



ఆంధ్రజ్యోతి: గంజాయి, పేకాట నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

ఎస్సై : గంజాయి, పేకాట నియంత్రణకు ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నాం. గంజాయి మత్తు బారినపడకుండా అవగాహన కార్యక్రమాలు చేపడుతూనే నియంత్రణ చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు ఎవరికైనా తెలిస్తే 100 కాల్ చేసి సమాచారం ఇవ్వాలి.

ఆంధ్రజ్యోతి: దొంగతనాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై : దొంగతనాలను నివారించేందుకు గస్తీని ముమ్మరం చేశాం. ఇటీవల పెద్దమ్మ వద్ద బంగారం దొంగతనం కేసును 24 గంటల్లో ఛేదించి, బంగారాన్ని రికవరీ చేశాం. 40 క్వింటాళ్ళ వరి ధాన్యం ఎత్తుకెళితే రికవరీ చేసి, నిందితులను జైలుకు పంపాం.

ఆంధ్రజ్యోతి: రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు..?

ఎస్సై : వాహనాల తనిఖీలు చేపడుతున్నాం. హెల్మెట్ లేకుండా, మద్యం సేవించి వాహనం నడపరాదని అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నాం. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా గ్రామాలవారీగా ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నియమాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై సూచనలు ఇస్తున్నాం.

- గంభీరావుపేట (ఆంధ్రజ్యోతి)

న్యూస్ బాక్స్

ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి రైతు నిరసన

ఇల్లంతకుంట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తన వ్యవసాయ బావి వద్దకు లోవోల్టేజీ విద్యుత్ సరఫరా అవుతోందని ముస్కానిపేట గ్రామానికి చెందిన సిరవేని రాజేశం అనే రైతు ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. తనకు న్యాయం జరిగేంతవరకు ట్రాన్స్‌ఫార్మర్ పైనే ఉంటానని పేర్కొన్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు రైతువద్దకు వచ్చి నచ్చజెప్పడంతో శాంతించిన రాజేశం ట్రాన్స్‌ఫార్మర్ దిగి కిందికి వచ్చాడు.

సిరిసిల్లకు తరలిన నాయకులు

ఇల్లంతకుంట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో జరిగిన సమావేశానికి మండలంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం తరలివెళ్లారు. మండలకేంద్రంలో దప్పులతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు మంద రాజు, నాయకులు పసుల వెంకటి, పట్నం మహేందర్, కాసుపాక శంకర్, గన్నారం నర్సయ్య, పసుల బాలరాజు, కాసుపాక సురేష్ పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

గంభీరావుపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన జంగిటి లింగం(75)శుక్రవారం సాయంత్రం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లింగం ఇటీవల కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆసుపత్రులకు వెళ్లినా నయం కాకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

- ప్రజలకు న్యాయం జరుగుతుంటే ఓర్వలేని ప్రతిపక్షాలు - ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



వెంకటాంపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



పత్తికుంటపల్లెలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

వేములవాడ రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని, దేశంలో ఎక్కడాలేని విధంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తెలంగాణలో అమలు చేస్తున్నామని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వెంకటాంపల్లిలో శుక్రవారం జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతీ నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు, నూతన రేషన్ కార్డులజారీ ప్రకియ 26వతేదీ నుంచి ప్రారంభంకానుందన్నారు. పేదలకు న్యాయం జరగుతుంటే ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ రొండి రాజు, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఆర్వో సుజాత, నాయకులు బండ శ్రీనివాస్, పలువురు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు..

ఇల్లంతకుంట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. ప్రజాపాలన గ్రామసభలలో భాగంగా శుక్రవారం పత్తికుంటపల్లె గ్రామంలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు దరఖాస్తులు చేసుకోవడం నిరంతరం కొనసాగుతుందన్నారు. జాబితాలో పేర్లు లేవని ఆందోళన చెందవద్దని సూచించారు. ప్రతిపక్షాల నాయకులు చేసే ఆరోపణలు పట్టించుకోవద్దన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కనీసం రేషన్‌కార్డులు ఇవ్వలేని వారు నేడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీవో శశికళ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్య, నాయకులు ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, అంతగిరి బాలపోచయ్య, వినయ్‌కుమార్, చల్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రామ, వార్డు సభలు

- జిల్లాలో 260 గ్రామ పంచాయతీలు
- సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో సభలు.. నిరసనలు

సిరిసిల్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రైతు భరోసా జాబితాలపై నాలుగు రోజుల పాటు కొనసాగిన గ్రామ, మున్సిపల్ వార్డు సభలు శుక్రవారం ముగిశాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో నాలుగు పథకాలకు సంబంధించి జాబితాల్లో పేర్లు లేనివారు 40360 మంది దరఖాస్తులు చేసుకున్నారు. రేషన్ కార్డులకు 16505, ఇందిరమ్మ ఇండ్లకు 14545, రైతు భరోసాకు 141, ఆత్మీయ భరోసాకు 9177 దరఖాస్తులు వచ్చాయి. ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తులకు సంబంధించిన పేర్లు జాబితాలో రాకపోవడంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో 260 గ్రామ పంచాయతీలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో జరిగిన వార్డుసభల్లో అధికారులను నిలదీశారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల జాబితాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో జరిగిన గ్రామసభల్లో రుద్రంగిలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లు పాల్గొన్నారు. గ్రామసభల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూలు పలు సభల్లో పాల్గొని పర్యవేక్షించారు. గ్రామసభలు ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

కాగా, శుక్రవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని వార్డుసభల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల తహసీల్దార్ ఉమారాణి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్మల స్వరూప, మెప్మా అధికారి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : మండలంలోని గూడెం, మోర్రాయిపల్లె, గన్నెవానిపల్లె, తుర్కపల్లె, గోపాల్‌పల్లె, వెంకట్రావుపల్లె తదితర గ్రామాల్లో మండల ప్రత్యేకాధిరి శీలత, క్లస్టర్ అధికారులు తహసీల్దార్ సురేశ్, ఏఈ దివ్య, ఎంపీడీవో బీరయ్య, ఏఈఈ భరత్, ఏవో అనూష ఆధ్వర్యంలో గ్రామసభలను ఆయా గ్రామాల్లో నిర్వహించారు. పార్లమెంట్ కోకన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ అంజనేయరావు, మాజీ సర్పంచ్‌ల ఫోరం కన్వీనర్ కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండలంలోని నాలుగు గ్రామాల్లో అధికారులు సభలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ విజయప్రకాశరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, ఎంపీడీవో శంకర్‌రెడ్డి, ఏవో సందీప్, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు లింగాపూర్, లింగన్నపేట, ముస్తాఫనగర్, గజసింగవరం గ్రామాల్లో ప్రజా పాలన గ్రామ సభలను అధికారులు నిర్వహించారు. గంభీరావుపేట, లింగాపూర్ గ్రామాల్లో అర్హులకు ఇండ్లు, రేషన్ కార్డులు రాలేదని ప్రజలు అధికారులను ప్రశ్నించారు. తాము దరఖాస్తు చేసుకున్నా జాబితాల్లో తమ పేర్లు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భూపతి, ఎంపీడీవో రాజేందర్, ఎంపీవో రాజశేఖర్‌గౌడ్, ఏఈఓ హరిప్రియ తదితరులతో పాటు పలు గ్రామ స్థాయి అధికారులు, పలు పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

గ్రామ సభలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల తోపులాట



బొప్పాపూర్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల వాగ్వాదం

ఎల్లారెడ్డిపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొప్పాపూర్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు మాటల యుద్ధానికి దిగారు. వేదికపైనే ఇరు వర్గాలు నిలదీసుకున్నారు. మీరేం చేశారంటే.. మీరేం చేస్తున్నారంటూ బాహాబాహీకి దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ప్రత్యేక పోలీసులు శాంతింపజేయడానికి ప్రయత్నించినా వినిపించుకోలేదు. సుమారు గంట పాటు ఒకరిపై ఒకరు దాడి చేసుకునే స్థాయికి చేరుకున్నారు. సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలోని పోలీసులు నిరసనకారులను సభ వద్ద నుంచి దూరం తీసుకెళ్లారు. దరఖాస్తులు చేసుకోవాలని అర్హులందరికీ అందించేందుకు కృషి చేస్తామని అధికారులు చెప్పడంతో నిరసనకారులు శాంతించారు. పరిస్థితిని తెలుసుకున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ గ్రామానికి చేరుకున్నారు. సభ తీరును పరిశీలించి పోలీసు అధికారులకు బందోబస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే మండలంలోని కోరుట్లపేట, బాకురుపల్లితండా, దేవునిగుట్టతండా, సింగారం, రాజన్నపేట గ్రామాల్లో అధికారులు శుక్రవారం ప్రజాపాలన గ్రామ సభలను నిర్వహించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, మండల ప్రత్యేక అధికారి అఫ్జల్‌బేగం, క్లస్టర్ అధికారులు సంతోష్, భాస్కర్‌రెడ్డి, సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలంటూ పోలీసుల విజ్ఞప్తి

ఇల్లంతకుంట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించని వాహనదారులకు జరిమానాలు విధిస్తున్నా మారకపోవడంతో పోలీసులు శుక్రవారం వినూత్న కార్యక్రమం చేపట్టారు. మండలకేంద్రంలో శుక్రవారం వాహనాల తనిఖీలు చేపట్టిన పోలీసులు హెల్మెట్ లేని వాహనదారులకు పూలు ఇచ్చారు. పోలీసులు చేపట్టిన హెల్మెట్ లేకుండా వాహనం నడపటం వల్ల ప్రాణాలు కల్పోతున్నారని ఇలా చేయడం జరిగిందని పోలీసులు పేర్కొన్నారు.

ముస్తాబాద్‌లో..

● ముస్తాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : హెల్మెట్ ధరించిన పలువురు వ్యక్తులకు ఎస్సై గణేశ్ శుక్రవారం వాహన తనిఖీలు చేస్తుండగా గులాబీ పువ్వులు ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీ భూమయ్య, పీసీ కుమార్, ఖాసీం, దామోదర్, శ్రీనివాస్, సంతోష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిని సందర్శించిన కేంద్ర బృందం

వేములవాడ టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ప్రాంతీయ ఏరియా ఆసుపత్రిని కేంద్ర బృందం శుక్రవారం సందర్శించింది. ఆసుపత్రికి వచ్చిన బృందం సభ్యులు ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వివిధ రకాల సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలపై సంతృప్తిని వ్యక్తం చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిని సందర్శించిన కేంద్ర బృందం సభ్యుల్లో డాక్టర్ ఫ్రాన్సిస్ జెవియర్, డాక్టర్ డాంగ్ ఉండగా, వెంట ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ పెంచలయ్య, డాక్టర్ సుభాషిణి తదితరులు ఉన్నారు.

ఓటరుగా గర్విద్దాం...

(5వ పేజీ తరువాయి)

అధికారి నుంచి అటెండర్ వరకు, ధనిక, పేద తేడా లేకుండా అందరికి ఒకే విధమైన గుర్తింపు కార్డు ఓటరు కార్డు మాత్రమే. భారత ఎన్నికల సంఘం జారీ చేసే గుర్తింపు కార్డు వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి.

సామాజిక బాధ్యతగా గుర్తించాలి..

- డాక్టర్ చింతోజు భాస్కర్, లోక్ అదాలత్ సభ్యుడు సిరిసిల్ల



సామాజిక బాధ్యతగా ఓటుహక్కు పొందడం, ఓటు వేయడాన్ని గుర్తించాలి. ఓటుహక్కు నమోదు కోసం విద్యావంతులు ప్రజల్లో అవగాహన పెంచడానికి కృషి చేయాలి. ఓటు హక్కు వేయడం కోసం నిర్బంధపు చట్టం తేవాలి.

ఓటు వేయడం మన బాధ్యత

- బుస్స అఖిల, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, సిరిసిల్ల



ఓటు వేయడం మన బాధ్యతగా గుర్తించాలి. ఓటుకు ఎంతో విలువ ఉంది. మన భవిష్యత్త్‌ను తీర్చిదిద్దే ప్రజా ప్రతినిధులను ఎన్నుకునే వీలు ఉంటుంది. ఓటు హక్కును ముఖ్యంగా యువత వినియోగించుకోవాలి. దేశ భవిష్యత్త్ కోసం ఓటు వేయాలి.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

- రాజూరి మాధవి, సిరిసిల్ల



ఓటు హక్కు వినియోగంతోనే ప్రజాస్వామ్యంలో మార్పులు సాధ్యమవుతాయి. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసువాలి. ఓటరునమోదు కోసం ఎన్నికల కమిషన్ ఎన్నో విధాలుగా అవకాశాలు కల్పిస్తోంది. ఆన్‌లైన్ ద్వారా ఓటరుగా నమోదు కావచ్చు.

ఓటు విలువ తెలుసుకోవాలి..

- మీసరగండ్ల సాయి సుహాస్, పెద్దలింగాపూర్



ఓటు విలువ ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి. ఓటు హక్కు వినియోగించుకోవడంతోనే ప్రజాస్వామ్యం విజయవంతం అవుతుంది. విద్యావంతులు, యువకులు ఓటింగ్ ప్రక్రియకు దూరంగా ఉండటం దురదృష్టకరం. ఓటును అమ్ముకోకుండా, సమర్థవంతులైన వ్యక్తులకు వేయడం ద్వారానే ఉత్తమ సమాజం నిర్మితం అవుతుంది.

ప్రభుత్వాలను ప్రశ్నించాలంటే ఓటు వేయాలి

- చిట్యాల అఖిల, కేసన్నపల్లె



ప్రభుత్వాలను ప్రశ్నించాలంటే ప్రతి ఒక్కరు ఓటు వేయాలి. ఓటు ద్వారానే సమానత్వం వస్తుంది. సరైన నిర్ణయం తీసుకొని ఓటు వేయకపోతే అసమర్థులు రాజ్యపాలన చేస్తారు. ఓటుహక్కును వినియోగించుకోని వారిపై చర్యలు తీసుకోవాలి. పట్టణాల్లో ఓటింగ్ శాతం పెంచడానికి ప్రభుత్వాలు కృషి చేయాలి.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే ఆయుధం..

- ఏలిగేటి నిఖిత, రుద్రంగి



ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే ఆయుధం. ప్రజల తలరాతలను మార్చే వజ్రాయుధం. సమాజంలో మార్పు రావాలంటే అవినీతిరహిత పాలన అందించే వారినే పాలకులుగా ఎన్నుకోవాలి. దీంతో గ్రామాలు అభివృద్ధి జరుగుతుంది

మంచి నాయకుడిని ఎన్నుకోవచ్చు..

- చెలుకల శ్రీకాంత్, రుద్రంగి



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ద్వారా నచ్చిన మంచి నాయకుడిని ఎన్నుకోవచ్చు భారత రాజ్యాంగంలో 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు ఓటు హక్కును కల్పించింది. ఓటు హక్కు దుర్వినియోగం కాకుండా సద్వినియోగం చేసుకోవాలి.

అమలుకాని ఆరు గ్యారెంటీ పథకాలు : సీపీఐ

సిరిసిల్ల టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలు పూర్తిగా అమలుకావడం లేదని సీపీఐ జిల్లాకార్యదర్శి గుంటి వేణు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో సీపీఐ జిల్లా ముఖ్యనాయకుల సమావేశంలో వేణు మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు పూర్తిగా అమలుకావడం లేదని, మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాల్లోని కూలీలకు ఉపాధిహామీ దూరమైందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలైతే కాంగ్రెస్ ప్రభుత్వం బదనాం కాక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో పంతం రవి, శ్రావణపల్లి మల్లేశం బాచుపల్లి శంకర్, రాములు, రాజేందర్, బాలనగర్ శంకర్, రాజయ్య, మల్లేశం, రాజమల్లయ్య, రమేస్,నారాయణ, బాలరాజు, అనిల్ రంగనాథ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

వేములవాడ రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నూకలమర్రి, హన్మాజిపేట గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు,మాజీ వైస్‌ఎంపీపీ, మాజీ ఎంపీటీసీలు, సింగిల్ విండో డైరెక్టర్లు సుమారు 200 మంది బీఆర్ఎస్, బీజేపీ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, పార్టీ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు సంఘ స్వామి, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం, నాయకులు సోయినేని కరుణాకర్, సామ తిరుపతిరెడ్డి, రోమాల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

చందుర్తి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుంచి ప్రారంభించనున్న రైతు భరోసా పథకాన్ని అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి దుర్గరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద, అర్హులైన రైతుకు సంవత్సరానికి, ఎకరానికి రూ.12వేల పెట్టుబడి సాయం అందించబడుతుందన్నారు. ఇప్పటికే రైతుబంధు పథకం లబ్ధిదారులుగా ఉన్న రైతులు, ఈ పథకానికి కొత్తగా అప్లికేషన్ పెట్టుకోవాల్సిన అవసరం లేదన్నారు. అర్హులైన రైతులు క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారికి దరఖాస్తుతో పాటు పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు, బాంక్ ఖాతా కాపీలను జత చేయాలని తెలిపారు.

పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలి

చందుర్తి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని మండల రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలుక పెంటయ్య అన్నారు. మండల కేంద్రంలో సంఘం మండల కార్యవర్గ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుబంధు ఎకరాన 15 వేలు ఇస్తామని ఇచ్చిన మాట తప్పిందన్నారు. ఫిబ్రవరిలో మండల స్థాయిలో రైతులకు శిక్షణ శిబిరం ఏర్పాటు చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. సమావేశంలో మండల కార్యదర్శి చంటి బాబురావు, కార్యవర్గ సభ్యులు దుద్దిల్ల లచ్చిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు వరికిల బాపూరావు, నాయిని నాగరాజు, ఎడ్ల కూషాలు, లక్ష్మీరాజం, మర్రి భూమరాజు, ఏరెడ్డి రాజిరెడ్డి, నల్మాస్ వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

ఎల్లారెడ్డిపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గరాజేశ్వరతండాలో తలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్ పర్సన్ సబేరాబేగం మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు పాటు పడుతోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, రవీందర్‌రెడ్డి, బుచ్చాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి..

- బీఆర్ఎస్ వేములవాడ ఇన్‌చార్జి లక్ష్మీనరసింహారావు



కోనరావుపేటలో మాట్లాడుతున్న లక్ష్మీనరసింహారావు

కోనరావుపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని వేములవాడ నియోజకవర్గం ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు అందరం కృషి చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాయ మాటలు చెబుతూ కాలయాపన చేస్తోందని అన్నారు. వారు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సెస్ వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, ప్యాక్స్ చైర్మన్లు రామ్మోహన్‌రావు, బండ నర్సయ్య, సీనియర్ నాయకుడు రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రయ్యగౌడ్, ప్రజా ప్రతినిధులు గోపు పరశురాములు, కాశవేణి మహేష్, సంతోష్, కచ్చకాయల మహేష్, చీటి సంధ్యారాణి, జ్యోతి, కెంద గంగాధర్, వెలిశాల సంతోష్, ఆవురం శరత్, ఆరె మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ఇల్లంతకుంట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలో సీఎం సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణ, తిప్పాపూర్ గ్రామంలో శుక్రవారం చెక్కులు అందించారు. చెక్కులు తీసుకున్న లబ్ధిదారులు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, నాయకులు అంతగిరి బాలపోచయ్య, చల్ల నారాయణ, బెజ్జంకి శ్రీనివాస్, మామిడి నరేష్, ప్రదీప్ రెడ్డి, మామిడి రాజు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

ముస్తాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బందనకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీయల్‌ను శుక్రవారం అందజేశారు. మండల గౌడ్ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందించారు. పదో తరగతి విద్యార్థులు బాగా చదువుకొని మంచి మార్కులు సాధించాలని ఎల్లమ్మల లక్ష్మణ్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎల్లమ్మల లక్ష్మణ్‌గౌడ్, హెచ్‌ఎం రాజుకుమార్, గోపా మండల అధ్యక్షులు పరశురాంగౌడ్, గోపా సభ్యులు శారదాదేవి, బండి పరశరాములు, వెంకటగోపాలచారి, సత్యనారాయణరావు, రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభల్లో అరాచకాలు సృష్టించే ప్రయత్నం..

- కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



సిరిసిల్లలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సభలో శాస్త్రీయ విధానంతో ప్రజలకు సంక్షేమ పథాకాలను అందించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే కొందరు అరాచకాలు సృష్టించాలని చూస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోనియగాంధీ ఒక మాట ఇచ్చారంటే ఆ మాటకు కట్టుబడి ఉంటారన్నారు. కరీంనగర్ బహిరంగ సభలో ఇచ్చిన మాటకు కట్టుబడి తెలంగాణ రాష్ట్రం ఇచ్చారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజల బతుకులు ఆగమయ్యాయన్నారు. ప్రజలు దాన్ని గ్రహించి సంవత్సరం క్రితం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించారన్నారు. గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో ప్రజలు కోల్పోయిన వాటిని తిరిగివ్వాలని కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు ఇచ్చిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా చిన్నాభిన్నం చేసినా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరకాలంగా ఇచ్చిన గ్యారెంటీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తున్నారన్నారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో రైతులు ఆత్మహత్యలు చేసుకోవడంలో దేశంలోనే తెలంగాణ రెండో స్థానంలో ఉందన్నారు. అధికారం కోల్పోయిన కేటీఆర్ ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడుతున్నాడన్నారు.ఈప్రాంత ప్రజల సమస్యలపై కేటీఆర్‌కు పట్టింపు లేదన్నారు. ప్రభుత్వం తప్పుచేస్తే కేటీఆర్ నిర్ణయాత్మకంగా నిలబడి, నిలదీయాలని, అప్పుడే ఈప్రాంత ప్రజాప్రతినిధి అవుతాడన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా ప్రజలకు అండగా ఉండాల్సిన కేటీఆర్ పదిహేను రోజులకు ఓసారి వచ్చి గాలి మాటలు మాట్లాడితే ప్రజలే గుణపాఠం చెపుతారన్నారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్మల స్వరూపతిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కామని వనిత, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, కౌన్సిలర్ కుడికాల రవికుమార్, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మినారాయణ, రాగుల జగన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

- మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం



విలేకరులతో మాట్లాడుతున్న కటకం మృత్యుంజయం

గంభీరావుపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) ప్రతి ఒక్క అర్హుడికి ప్రభుత్వ పథకాలు అందుతాయని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం అన్నారు. గంభీరావుపేటలో ప్రజా పాలన గ్రామసభ అనంతరం కటకం మృత్యుంజయం విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్షాలు సమస్యను ఎత్తిచూపే విధంగా కాకుండా సమస్యను పరిష్కరించే దిశగా ప్రయత్నం చేయాలన్నారు. చివరి అర్హుడి వరకు రేషన్ కార్డు మొదలు కొని ఏ పథకమైన ఇప్పించటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. గత ప్రభుత్వంలో ఇక్కడ డబుల్ బెడ్ రూం ఇండ్ల మంజూరు లో అవకతవకలు జరిగాయని, అర్హులకు రాలేదని, అనర్హులకు వచ్చాయని ఆరోపణలు ఉన్నాయని, దీనిపై అప్పుడు అధికారులు ఏం చేశారో నాకు తెలియదన్నారు. అలాంటి తప్పిదాలు ఉంటే చట్టపూరమైన చర్యలు తీసుకోవల్సి ఉంటుందన్నారు. ఇప్పుడు అలా కాకుండా ఇండ్ల మంజూరులో, రేషన్ కార్డుల మంజూరులో ఎవరైన అనర్హులు ఉంటే అధికారులకు చెప్పే సామాజ్యిక బాధ్యత ప్రజలదన్నారు. అనర్హులను, అర్హులను గుర్తించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గ్రామసభల్లో చదివిన పేర్లే తుది జాబితా కాదని, అర్హులకు న్యాయం జరిగే విధంగా చేర్పులు, మార్పులు ఉంటాయన్నారు. అర్హులకు న్యాయం జరిగే విధంగా గ్రామసభల్లో అందరు మాట్లాడుకోవాలన్నారు. అనర్హులను తొలగించి, అర్హులకు న్యాయం చేయాలని అధికారులకు సూచించడం జరిగిందన్నారు. అవసరమైతే మండల కాంగ్రెస్ అధ్యక్షులు అర్హుల జాబితాను సేకరించి, న్యాయం చేసే విధంగా చూడాలన్నారు.